గొంతెండుతున్న 'పాలమూరు'

- పట్టణాలతో సహా ఏజెన్సీ ప్రాంతాల్లో తాగునీటి కష్టాలు
- పడిపోయిన పాతాల జలం
- పెరిగిన ఉష్ణోగ్రతలతో పెరుగుతున్న నీటి అవసరాలు
- రిజర్వాయర్లలో పడిపోయిన నీటిమట్టాలు
- వనపర్తి పట్టణంలోనే నీటి ఎద్దడి



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎండలు ముదిరిన కొద్ది తాగునీటి కష్టాలు పెరుగుతున్నాయి. ఏజెన్సీ ప్రాంతమైన నల్లమలలోని చెంచుపెంటలు తాగునీటి కోసం బుగ్గలు, చెలిమెల దగ్గరకు పరుగులు తీస్తున్నారు. కానీ అవసరాలకు తగిన నీటిని సరఫరా కావడం లేదు. రిజర్వాయర్లలో నీటిమట్టాలు డెడ్ స్టోరేజీకి పడిపోవడం, పాతాల జలం సైతం క్రమంగా తగ్గడం వల్ల తాగునీటి ఎద్దడి తీవ్రంగా మారింది. ముఖ్యంగా జూరాల సమీపంలో ఉండే వనపర్తి పట్టణంలోనే తాగునీటి ఎద్దడి నెలకొన్నది. తాగునీటి అవసరాల కోసం ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని మహిళా సంఘాలు కోరుతున్నారు.

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో సాగునీటి సమస్య ఉండేది. ఇప్పుడు తాగునీటికి సైతం తండ్లాడే సమయం వచ్చింది. మిషన్ భగీరథ్ ద్వారా తాగునీరించే ఎల్లూరు రిజర్వాయర్‌లో సాధారణంగా ఏడు టిఎంసిల నీరు ఉండాలి. తాజాగా 0.5 టిఎంసిల నీరు మాత్రమే ఉంది. ఈ నీరు ఎండలు ముదిరితే.. అవిరైపోతుంది. నాగర్‌కర్నూల్, వనపర్తి, మహబూబ్‌నగర్, వికారాబాద్, రంగారెడ్డి జిల్లాలకు తాగునీరు అందించే కల్వకుర్తి ఎత్తిపోతలలో భాగంగా నిర్మించిన ఎల్లూరు రిజర్వాయర్‌లో నీటి లభ్యత లేదు. జూరాల నుంచి 1.22 టిఎంసిలు, ఎల్లూరు నుంచి 7.12 టిఎంసిలు, కోయిల్‌సాగర్ నుంచి 1.3 టిఎంసిలు నిల్వ ఉంటేనే తాగునీరు లభించేది. అయితే, ఇప్పుడు రిజర్వాయర్లలో డెడ్ స్టోరేజీకి నీటి మట్టాలు పడిపోవడంతో తాగునీటి కష్టాలు ఏర్పడ్డాయి. శ్రీశైలం రిజర్వాయరులో 810 అడుగులకు నీటిమట్టం పడిపోయింది. ముమ్ముందు మరింత పడిపోయే అవకాశాలు ఉన్నాయి.

మొదలైన తాగునీటి కష్టాలు

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో తాగునీటి కష్టాలు మొదలయ్యాయి. వనపర్తి మున్సిపాల్టీలో నాలుగు రోజులకొకసారి నీటిని వదులుతున్నారు. పీర్లగుట్ట, చిట్యాల డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, హరిజనవాడలో నీటి ఎద్దడి అధికంగా ఉంది. నాలుగు రోజుల కొకసారి తాగునీటిని వదలుతున్నారు. ముఖ్యంగా అమరచింత మండల పరిధిలోని నందిమల్ల గ్రామంలో తాగునీటి సమస్య తాండవిస్తోంది. ఉన్న ఒక లిప్టు చెడిపోవడంతో గ్రామస్తులు వ్యవసాయ బావులలోకి దిగి తాగునీటిని తెచ్చుకుంటున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా బిజనపల్లి మండలాల పరిధిలో క్రమంగా నీరు రావడం లేదు. తెలకపల్లి మండల కేంద్రంలో నీటి సరఫరా ఉన్నా.. మడ్డీగా వస్తున్నాయి. దాంతో ఆ నీళ్లు తాగిన వారికి వాంతులు, విరోచనాలు వచ్చి మంచం పడుతున్నారు.

ఏజెన్సీవాసుల సమస్యలు వర్ణనాతీతం

ఇక ఏజెన్సీ వాసుల సమస్యలు వర్ణనాతీతంగా ఉన్నాయి. ఎండలు ముదిరినా కొద్దీ భూగర్భ జలాలు పడిపోవడం వల్ల బుగ్గలు, చెలిమలు ఎండిపోయాయి. నల్లమల చెంచులకు తాగునీరు లేక పదుల కిలో మీటర్లు ప్రయాణించి కృష్ణా నీటిని తెచ్చుకుంటున్నారు. అప్పాపూర్, లక్ష్మీపల్లి, మల్లాపూర్, అప్పాపూర్, బౌరాపూర్, వెంకటేశ్వర్లబావి, కొమ్మన్‌పెంట, పెట్రోల్ చేను తదితర 70కి పైగా చెంచుపెంటల్లో ఏడు వేల మంది చెంచులు జీవిస్తున్నారు. వీరంతా తాగునీటి కోసం అల్లాడుతున్నారు. ఏజెన్సీ ప్రాంతాలకు తాగునీటిని ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయాలని మహిళా సంఘాలు, ప్రజా సంఘాలు కోరుతున్నాయి. పాలకులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు.

కెసిఆర్‌వన్నీ అబద్ధాలే

- ఆయన ప్రెస్‌మీట్‌లో కరెంటు పోలేదు
- విద్యుత్‌శాఖ సూర్యాపేట డివిజన్ ఎస్ఇ వివరణ

ప్రజాశక్తి -హైదరాబాద్‌బ్యూరో

విద్యుత్ సరఫరాపై సూర్యాపేట బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి, ప్రతిపక్షనేత కె చంద్రశేఖరరావు తప్పుడు ఆరోపణలు చేశారని టిఎస్ఎస్‌పిడిసిఎల్ సూర్యాపేట డివిజన్ సూపరింటెండెంట్ ఇంజనీర్ స్పష్టత ఇచ్చారు. విలేకరుల సమావేశంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగిందనేది అబద్ధమన్నారు. సూర్యాపేట పట్టణంలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమం మొత్తం ప్రయివేటు జనరేటర్‌తో నడిచిందనీ, అసలు టిఎస్-ఎస్‌పిడిసిఎల్ విద్యుత్ సరఫరాకు అనుసంధానమే కాలేదని స్పష్టత ఇచ్చారు. అదే సమయంలో ఆ చుట్టుపక్కల అన్ని ఇళ్లలో కరెంటు ఉందనీ, జనరేటర్ ఆఫ్ చేసి విద్యుత్ సంస్థలను బదనాం చేశారని వివరణ ఇచ్చారు. ఈ మేరకు టిఎస్‌జెన్‌కో సిఎమ్‌డి రిజ్వీకి సూర్యాపేట ఎస్ఇ లిఖిత పూర్వక నివేదిక ఇచ్చారు.

ప్రకృతి వైపరీత్యాలు ప్రభుత్వ వైఫల్యమా...?

- మంత్రి తుమ్మల

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రకృతి వైపరీత్యాలు, వర్షాభావ పరిస్థితులను ప్రభుత్వ వైఫల్యంగా చూపాలని ప్రతిపక్ష నేత కెసిఆర్ ప్రయత్నిస్తున్నారని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. రైతుబంధు పేరుతో వ్యవసాయానికి సంబంధించిన పథకాలన్నీ ఎత్తివేసి చిన్న, సన్నకారు రైతులను కోలుకోలేని దెబ్బతీశారని మండిపడ్డారు. వర్షాకాలం తర్వాత తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందన్నారు. నాగార్జునసాగర్‌లో నీళ్లు లేని కారణంగా మొదటి పంటకే నీళ్లివ్వని బిఆర్ఎస్ నేతలు.. రెండో పంటకు నీరివ్వాలని హేతుబద్ధతలేని డిమాండ్ చేయడం దారుణమన్నారు. గోదావరి వరదల కారణంగా సర్వస్వం కోల్పోయిన రైతులకు రూ.వెయ్యి కోట్లు ఇస్తామని చెప్పి.. వెయ్యి పైసలైనా ఇచ్చారా? అని ప్రశ్నించారు. పంటల బీమా పథకాన్ని ఎత్తేసి అంతకన్నా గొప్ప పథకాన్ని తెస్తామని ప్రగల్భాలు పలికి రైతుల నోట్లో మట్టికొట్టారని ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

భుజంగరావుపై రియల్ ఎస్టేట్ వ్యాపారుల ఫిర్యాదులు

- మూడో రోజు కొనసాగిన తిరుపతన్న, భుజంగరావుల విచారణ
- మరో ఇద్దరు కానిస్టేబుళ్లకు నోటీసులు

ప్రజాశక్తి -హైదరాబాద్‌బ్యూరో

ఫోన్ ట్యాపింగ్ కేసులో నిందితుడైన అదనపు ఎస్‌పి భుజంగరావుపై కొందరు రియల్‌ఎస్టేట్ వ్యాపారులు పోలీసు అధికారులకు తాజాగా ఫిర్యాదు చేశారు. తమను పీడించి, బెదిరింపులకు గురి చేసి పెద్ద మొత్తంలో డబ్బులు దండుకున్నారని వారు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ముఖ్యంగా, ప్రముఖ రియల్ ఎస్టేట్ కంపెనీ సంధ్యా కన్‌స్ట్రక్షన్స్ అధినేత శ్రీధర్‌రావు ఆదివారం పంజాగుట్ట పోలీసు స్టేషన్‌కు వచ్చి ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తు జరుపుతున్న అధికారులను కలిసి ఫిర్యాదు చేశారు. భుజంగరావుతోపాటు వారి బృందం తన ఫోన్‌ను కూడా ట్యాపింగ్ చేశారని ఫిర్యాదు చేశారు. ఆ సమయంలో పలుమార్లు తన కార్యాలయానికి పిలిపించుకొని డబ్బులు డిమాండ్ చేశారనీ, తన వ్యాపారంలో సహకరించాలని భుజంగరావు ఒత్తిడి తీసుకొచ్చారని శ్రీధర్‌రావు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. తన మాట వినకపోతే మానసిక క్షోభకు గురి చేశారనీ, తనపై తప్పుడు కేసులు పెట్టించారని శ్రీధర్‌రావు ఆరోపించారు. రాధాకిషన్‌రావు కూడా టాస్క్‌ఫోర్స్ ఓఎస్‌డిగా ఉన్న సమయంలో తన వద్ద నుంచి భారీ మొత్తంలో డబ్బులు డిమాండ్ చేసి తీసుకున్నారని ఆయన ఫిర్యాదు చేశారు.

మరికొందరు రియల్‌ఎస్టేట్ వ్యాపారులు సైతం తాము ప్రణీత్‌రావు, భుజంగరావు, తిరుపతన్న, రాధాకిషన్‌రావుల నుంచి ఎదుర్కొన్న ఇబ్బందులు, బెదిరింపులు, వారు తమ నుంచి డబ్బులు దండుకున్న తీరును కూలంకషంగా వివరించారని తెలుస్తున్నది. ఈ సందర్భంగా కొందరు కానిస్టేబుళ్ల పేర్లను కూడా వారు అధికారుల దృష్టికి తీసుకొచ్చినట్టు సమాచారం. దీంతో, సదరు కానిస్టేబుళ్లకు నోటీసులిచ్చి విచారణకు పిలవటానికి దర్యాప్తు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిసింది.

తమ కస్టడీలో ఉన్న భుజంగరావు, తిరుపతన్నలను మూడో రోజు కూడా అధికారులు విచారించారు. ఉన్నతాధికారులు ఇచ్చిన ఆదేశాల మేరకే తాము నడుచుకున్నామనీ, ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం కూడా ఆ అధికారి చెప్పిన మేరకే సాగిందని భుజంగరావు, తిరుపతన్న దర్యాప్తు అధికారులకు స్పష్టం చేసినట్టు సమాచారం. అయితే, ఆదివారం నాడు వీరి విచారణ చాలా వరకు ఎస్ఐబి మాజీ ఓఎస్‌డి ప్రభాకర్‌రావును కేంద్రీకృతం చేసి సాగినట్టుగా సమాచారం. కొన్ని సందర్భాల్లో ప్రభాకర్‌రావు వీరిని తన ఛాంబర్‌కు పిలుచుకొని పనులు అప్పగించినట్టు తెలిసింది. జైల్లో ఉన్న మరో నిందితుడు టాస్క్‌ఫోర్స్ మాజీ డీసీపీ రాధాకిషన్‌రావును విచారణ కోసం కస్టడీకి ఇవ్వాలంటూ సోమవారం దర్యాప్తు అధికారులు కోర్టులో పిటిషన్‌ను దాఖలు చేయనున్నారు. రాధాకిషన్‌రావును విచారణ జరిపితే మరికొందరు సీనియర్ పోలీసు అధికారుల పేర్లు కూడా బయటపడే అవకాశమున్నదని తెలుస్తోంది.

ఆ నలుగురి పని పట్టాల్సిందే..
ఆయా సీట్లు కచ్చితంగా గెలవాల్సిందే...

- చేవెళ్ల, వరంగల్, పెద్దపల్లి, సికింద్రాబాద్ స్థానాలపై కెసిఆర్ నజర్
- చేవెళ్ల సభను ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలంటూ సూచన
- రంజిత్‌రెడ్డి, కడియం, దానం నాగేందర్‌ను వదలొద్దంటూ ఆదేశాలు

ప్రజాశక్తి -హైదరాబాద్‌బ్యూరో

'పదవి లేకపోతే.. సీటివ్వకపోతే ఓకే... కానీ అన్ని రకాలుగా అనుభవించి, పార్టీకి ద్రోహం చేసి, నన్ను మోసం చేసి పోయిన ఆ ముగ్గురిని మాత్రం ఎట్టి పరిస్థితుల్లోనూ వదలొద్దు.. కచ్చితంగా ఓడించి తీరాలె...' అంటూ బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ పార్టీ ముఖ్య నేతలకు సూచించారు. ఎంపి టికెట్ ఇచ్చిన తర్వాత... పార్టీ మారి 'హ్యాండిచ్చిన' చేవెళ్ల సిట్టింగ్ ఎంపి గడ్డం రంజిత్‌రెడ్డి, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌ను ఉద్దేశించి ఆయన ఈ విధమైన వ్యాఖ్యలు చేశారు. ఎన్నో ఏండ్ల నుంచి గులాబీ పార్టీకి వెన్నంటి ఉన్న ఉద్యమకారులు, సీనియర్లను కాదని, ఆ ముగ్గురిని అక్కున చేర్చుకుని అందల మెక్కిస్తే...చివరకు నమ్మించి నట్టేట ముంచారంటూ ఆయన వాపోయారు. అందువల్ల చేవెళ్లలో రంజిత్‌రెడ్డిని, సికింద్రాబాద్‌లో దానంను, వరంగల్‌లో కడియంను (కాంగ్రెస్ నుంచి టిక్కెట్ వచ్చే అవకాశముంది) కచ్చితంగా ఓడించి తీరాలనీ, ఇందుకోసం శాయశక్తులా కృషి చేయాలని ఆయన ఆదేశించారు. సీనియర్లు, జూనియర్లు అనే తేడా లేకుండా ఒక్కొక్కరుగా బిఆర్ఎస్‌ను వీడుతున్న తరుణంలో... ఇటీవల ముఖ్య నేతలు, తనకు అత్యంత సన్నిహితులైన నాయకులతో కెసిఆర్ అంతర్గత సమావేశం నిర్వహించారని సమాచారం. ఈ సందర్భంగా ఆయన తాజా రాజకీయ పరిణామాలపై వారితో చర్చించారు. రంజిత్‌రెడ్డి, దానం నాగేందర్, కడియం శ్రీహరి తదితరులు పార్టీ మారటానికి గల కారణాలపై ఆయన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయా నియోజకవర్గాల్లో బిఆర్ఎస్‌ను గెలిపించేంద ుకు, మోసం చేసిన వారి పని పట్టేందుకు గట్టి కృషి చేయాలని ఆయన దిశా నిర్దేశం చేశారు. కాసాని గెలుపు ఖాయం... చేవెళ్లలో బిఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ గెలుపు ఖాయమని కెసిఆర్ ఈ సందర్భంగా ధీమా వ్యక్తం చేశారు. ఈ నెల 13న చేవెళ్లలో నిర్వహించబోయే భారీ బహిరంగ సభకు లక్ష మంది దాకా సమీకరించాలని ఆయన పార్టీ శ్రేణులను ఆదేశించారు. ఆ సభను విజయవంతం చేయడంద్వారా కాసాని గెలుపు సంకేతాలివ్వాలంటూ నేతలకు సూచించారు.

లోక్‌సభ స్థానాలకు కాంగ్రెస్ ఇన్‌ఛార్జుల నియామకం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో తెలంగాణలోని లోక్‌సభ నియోజకవర్గాలకు కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జులను నియమించింది. ఈ మేరకు రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జ్ దీపాదాస్ మున్షీ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఖమ్మం ఇన్‌ఛార్జిగా పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, నల్గొండ - ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కరీంనగర్ - పొన్నం ప్రభాకర్, పెద్దపల్లి - శ్రీధర్‌బాబు, వరంగల్ - ప్రకాశ్‌రెడ్డి, మహబూబాబాద్ - తుమ్మల నాగేశ్వరరావు, హైదరాబాద్ - ఒబేదుల్లా కొత్వాల్, సికింద్రాబాద్ - కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, భువనగిరి - కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, నాగర్‌కర్నూల్ - జూపల్లి కష్ణారావు, చేవెళ్ల - నరేందర్‌రెడ్డి, మల్కాజిగిరి - మైనంపల్లి హన్మంతరావు, మెదక్ - కొండా సురేఖ, నిజామాబాద్ - సుదర్శన్‌రెడ్డి, ఆదిలాబాద్ - సీతక్క, జహీరాబాద్ - దామోదర రాజనర్సింహ.

రైతులు ఇప్పుడు గుర్తుకు వచ్చారా?

- పిసిసి అధికార ప్రతినిధి దయాకర్‌గౌడ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పదేళ్ల ఫామ్ హౌస్ పాలనలో గుర్తుకురాని రైతులు ఇప్పుడు గుర్తుకు వచ్చారా? అని పిసిసి అధికార ప్రతినిధి చనగాని దయాకర్‌గౌడ్ మాజీ సిఎం కెసిఆర్‌ను ఒక ప్రకటనలో ప్రశ్నించారు. అధికారంలో ఉన్నప్పుడు ఏనాడూ ఆయన ప్రజల దగ్గరకు వెళ్లలేదని విమర్శించారు. అసెంబ్లీకి రాకుండా, సచివాలయంవైపు కన్నెత్తి చూడకుండా ఫామ్ హౌస్‌కే పరిమితమయ్యారని తెలిపారు. రైతు బంధును కొండలు, గుట్టలకు ఇవ్వడంతోపాటు దళారుల జేబులు నింపారని ఆరోపించారు. ప్రజలు ఛీకొట్టిన తర్వాత వారినే అడ్డం పెట్టుకుని రైతుల పేరిట రాజకీయం మొదలు పెట్టారని ఆయన ఎద్దేవా చేశారు.



ప్రతిపక్షంలోకి వచ్చాక సమస్యలెంటో తెలిసిందా?

- కెసిఆర్‌కు అద్దంకి దయాకర్ ప్రశ్న

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రతిపక్షంలోకి వచ్చిన తర్వాత ప్రజా సమస్యలెంటో తెలిసిందా? అని కాంగ్రెస్ నేత అద్దంకి దయాకర్ కెసిఆర్‌ను ప్రశ్నించారు. రాజకీయాల కోసమే పొలం బాట పట్టారని ఎద్దేవా చేశారు. జనం బాట మరచిన కెసిఆర్‌కు ప్రజల ఎజెండా కూడా తెలియని పరిస్థితుల్లో ఉన్నారని ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాజకీయాల్లో పతనమవుతున్నామనే విషయం తెలిసిన తర్వాత కెసిఆర్ నేడు జనంలో కనపడటం చాలా విచిత్రంగా ఉందన్నారు. పదేళ్ల క్రితం మర్చిపోయిన జనాలను ఆయన రాజకీయాల కోసం వాడుకుంటున్నారని తెలిపారు. అప్పుడే ఇలాంటి కార్యక్రమాలు చేసుంటే ఈ గోస వచ్చేది కాదని గుర్తు చేశారు. గతంలో పంట నష్టపోయిన రైతులను పట్టించుకోలేదని విమర్శించారు. కెసిఆర్ రైతుల కోసం మొసలికన్నీరు కారుస్తున్నారని ఎద్దేవా చేశారు. ఎన్నికలు, రాజకీయాలు తప్ప కెసిఆర్‌కు ఏమీ తెలియదని విమర్శించారు. అసెంబ్లీకి రాని కెసిఆర్ తన ఉనికి కోసమే పొలం బాట అని ఎద్దేవా చేశారు.



సికింద్రాబాద్‌లో బిఆర్ఎస్‌దే గెలుపు

- అంబర్‌పేట పాదయాత్రలో పాల్గొన్న కెటిఆర్
- హైదరాబాద్ ప్రజలు మరోసారి మద్దతివ్వాలని విజ్ఞప్తి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సికింద్రాబాద్ పార్లమెంటు నియోజకవర్గ అభ్యర్థి పద్మారావు గౌడ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సికింద్రాబాద్ నియోజకవర్గ ఎంపిగా.. పదేండ్లలో రాష్ట్రం నుంచి కేంద్ర మంత్రిగా ప్రాతినిధ్యం వహించిన కిషన్ రెడ్డి హైదరాబాద్ నగరానికి, తెలంగాణకు ప్రత్యేకంగా అదనపు ప్రాజెక్టుగానీ, ఒక్క రూపాయి అదనపు నిధులు కానీ ఏమీ తెలేదని విమర్శించారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో సికింద్రాబాద్ బిఆర్ఎస్ ఎంపి అభ్యర్థి టి.పద్మారావు గౌడ్‌కు మద్దతుగా అంబర్‌పేట నియోజకవర్గంలో కెటిఆర్ పాదయాత్ర నిర్వహించారు. పటేల్ నగర్ ప్రాంతంలోని ప్రేమ్ నగర్ చౌరస్తా నుంచి ఆజాద్ నగర్, పటేల్ వాడల్లో ఇంటింటికి తిరుగుతూ బిఆర్ఎస్‌ను గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంబర్‌పేట నియోజకవర్గంలో ప్రజల చేతిలో తిరస్కారానికి గురైన తర్వాత, గత ఎన్నికల్లో సికింద్రాబాద్ నుంచి ఎంపిగా గెలిచారన్నారు. గెలిచిన తర్వాత అటు అంబర్‌పేట నియోజకవర్గానికి గాని, పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో కానీ ఎలాంటి అభివృద్ధి చేయలేదని తెలిపారు. పదేండ్లలో బిఆర్ఎస్ ప్రభుత్వం హైదరాబాద్ నగరానికి చేసిన అభివృద్ధిని గుర్తుంచుకొని, తమ పార్టీ అభ్యర్థికి మద్దతు ఇవ్వాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. పాదయాత్రలో భాగంగా పలువురు ఇళ్లకు వెళ్లడంతోపాటు, మార్గమధ్యలో ఉన్న ప్రతి ఒక్కరిని కెటిఆర్ పలకరించుకుంటూ ముందుకు సాగారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు తలసాని శ్రీనివాస్ యాదవ్, కాలేరు వెంకటేష్, ముఠా గోపాల్, స్థానిక కార్పొరేటర్లు విజయ్ కుమార్ గౌడ్, యువజన నాయకులు రామేశ్వర్ గౌడ్, ముఠా జై సింహ, డివిజన్ ప్రెసిడెంట్ సిద్ధార్థ ముదిరాజ్, సీనియర్ నాయకులు లవంగు ఆంజనేయులు, లింగారావు, మహేష్ ముదిరాజ్ భవాని ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్ధరించుడు లేదు.. ఉద్దర మాటలే

- రైతులకిచ్చిన ఏ హామీ అమలు కాలే
- కాంగ్రెస్‌కు ఓట్లేస్తే మళ్లీ మోసపోతాం
- రాముడి అక్షింతలు తప్ప రాష్ట్రానికి బిజెపి చేసిందేమీ లేదు
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

'100 రోజుల కాంగ్రెస్ బాండ్ పేపర్ పాలనలో ఉద్ధరించుడు మాట దేవుడెరుగు కానీ, అన్నీ ఉద్దెర మాటలే చెప్తున్నారు. ఆరు గ్యారంటీల్లో ఇస్తానన్న మొదట హామీ అయిన ప్రతి నెలా మహిళలకు రూ. 2,500లు డిసెంబర్ నెల నుంచి ఇస్తామన్న దాన్ని నిలబెట్టుకోలే. రైతులకు ఇచ్చిన ఏ ఒక్క హామీ నెరవేర్చలేదు. కొత్త హామీలు అమలు కాకపోగా, ఉన్న పథకాలూ అటకెక్కించిన ఘనత ఈ కాంగ్రెస్ పార్టీది. కాంగ్రెస్ పార్టీ వచ్చింది. కరువు వచ్చింది. కరెంట్ మోటార్లు కాలిపోతున్నాయి' అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలోని కామారెడ్డి, ఎల్లారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని కామారెడ్డి, ఎల్లారెడ్డిలో ఆదివారం బిఆర్ఎస్ కార్యకర్తల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్‌కు ఓటేస్తే మోసపోతామని, రూ.రెండు లక్షల రుణమాఫీ, రూ.4,000 పెన్షన్, తులం బంగారం లాంటి హామీలను అమలుచేయలేదని విమర్శించారు. కాబట్టి, కాంగ్రెస్ పార్టీని ఓడగొట్టాలని, దీనిపైన ప్రతి గ్రామంలో చర్చ జరగాలని, అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో ఒక్క హామీనీ అమలు చేయని కాంగ్రెస్‌కు ఎంపి ఎన్నికల్లో ఓట్లడిగే అర్హత లేదన్నారు. యాసంగి వడ్లకు రూ.500 బోనస్ ఇస్తామన్న కాంగ్రెస్ పార్టీ, ఇప్పుడు ఏ ముఖం పెట్టుకుని ఓట్లు అడుగుతారని ప్రశ్నించారు. కారుకు ఓటేసి కాంగ్రెస్‌కు గుణపాఠం నేర్పాలన్నారు.

నిరుద్యోగులను, రైతులను మోసం చేసిన పార్టీ బిజెపి అని, ఆ పార్టీ ఎందుకు ఓటెయ్యాలని, ఏం ఇచ్చిందని ఓటు వేయాలని ప్రశ్నించారు. రాముడి అక్షింతల పేరుతో రాజకీయం చేయడం తప్పా.. తెలంగాణ రాష్ట్రానికి చేసిందేమీ లేదన్నారు. సోషల్ మీడియాలో లీకు న్యూస్‌లు, ఫేక్ వార్తలతో గోబెల్స్ ప్రచారం చేయిస్తూ రాజకీయ పబ్బం గడుపుతుంది కాంగ్రెస్ పార్టీ అని ఆగ్రహం వ్యక్తం చేశారు. బిఆర్ఎస్ పార్టీ నుంచి కారు గుర్తుపై గెలిచి ఈ రోజు కాంగ్రెస్ కండువా కప్పుకున్న దానం నాగేందర్, కడియం శ్రీహరి వెంటనే తమ శాసనసభ సభ్యత్వానికి రాజీనామా చేయాలని, స్పీకర్ కూడా వారిపై చర్యలు తీసుకొని, అనర్హత వేటు వేయాలని డిమాండ్ చేశారు. గాంధేయ వాదంతో రాష్ట్రాన్ని సాధించిన నాయకుడు, మన అధినేత కెసిఆర్ అని, అదే పోరాట స్ఫూర్తితో మన బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి, ఉద్యమకారుడు గాలి అనిల్ కుమార్‌ను గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమాల్లో మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు గంపగోవర్ధన్, జాజాల సురేందర్, హన్మంత్‌షిండే తదితరులు పాల్గొన్నారు.



ఎంటిన పంటలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

ఎండిన పంటల పరిశీలన

కామారెడ్డి జిల్లా లింగంపేట్ మండల కేంద్రంలో ఎండిన పంటలను మాజీ మంత్రి హరీశ్‌రావు పరిశీలించారు. రైతులు తమ కష్టాలు చెప్పుకుని కన్నీటి పర్యంతమయ్యారు. సాగు నీరు లేకపోవడం వల్ల తమ పంటలు ఎండిపోయిన తీరును రైతులు వివరించారు. మూడు ఎకరాల్లో వరి సాగు చేస్తే బోరు మోటారు 3 సార్లు కాలిపోయిందని, కాలిపోయిన ప్రతిసారీ రూ.ఐదు వేలు ఖర్చు అవుతోందని స్వామి అనే రైతు అవేదన వ్యక్తం చేశారు. పొట్టదశకు వచ్చిన పొలం నీళ్లు లేక ఎండిపోయిందని, పెట్టుబడి మొత్తం పోయిందని మంజీర అనే మహిళా రైతు తన కష్టాన్ని చెప్పుకున్నారు. ఆందోళన చెందొద్దని, తాము అండగా ఉంటామని ఈ సందర్భంగా హరీశ్‌రావు రైతులకు భరోసా ఇచ్చారు. ప్రభుత్వం నుంచి ఎకరాకు రూ.25 వేల పరిహారం ఇప్పించేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

పొలిటికల్ మైండ్ గేమ్

- రాష్ట్రాన్ని హీటెక్కిస్తున్న నేతల వ్యాఖ్యలు
- దుర్భాషలు, దుందుడుకు మాటలతో కవ్వించే యత్నం
- ఎవ్వరి నోటా విన్నా గేట్లెత్తేస్తాం..కూల్చేస్తాం..పడగొట్టేస్తాం మాటలే
- రాజకీయంగా పైచేయి సాధించేందుకు పాట్లు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎండలతోనేగాదు.. నేతల హాట్‌హాట్ కామెంట్లతోనూ రాష్ట్రంలో ఒక్కసారిగా రాజకీయ వాతావరణం వేడెక్కింది. ఎన్నికల తేదీకి ఇంకా నెలకుపైగా గడువున్నప్పటికీ నేతల మధ్య మాత్రం మాటల యుద్ధం మాత్రం ఇప్పటికే షురూ అయ్యింది. దుర్భాషలు, దుందుడు మాటలు, రెచ్చగొట్టే వ్యాఖ్యల వాగ్దాటి తీవ్రమైంది. గేట్లెత్తేస్తాం.. కూల్చేస్తాం.. పడగొట్టేస్తాం.. ఖాళీచేసేస్తాం.. ఖతంచేసేస్తాం వంటి మాటల్ని నేతల నోటి నుంచి నిత్యం వినాల్సి వస్తోంది. ఇలా ఎవరికి వారు రాజకీయంగా పట్టు సాధించేందుకు పాట్లుపడుతున్నారు. సోషల్ ఇంజినీరింగ్‌తో ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు కామెంట్ల తో మైండ్ గేమ్ ఆడుతున్నారు ఈ విమర్శలు, ప్రత్యారోపణల పర్వం ఎటువైపు దారితీస్తుందో వేచిచూడాల్సిందే. కాంగ్రెస్, బిఆర్ఎస్ ఒక్కటే...చల్ బిజెపి, బిఆర్ఎస్ ఒక్కటే..కాదుకాదు బిజెపి-కాంగ్రెస్ ఒక్కట అనే మాటలతో ఇంతకూ ఏ పార్టీ దేనితో మిలాఖత్ అయ్యిందో అనేది అర్థం కానంతగా జనాన్ని అయోమయానికి, గందరగోళానికి గురిచేస్తున్న పరిస్థితి నెలకొంది. లోగుట్టు పెరుమాండ్లకే ఎరుక. రాజకీయ విమర్శల దాటిలో ప్రజాసమస్యలు, కీలకమైన అంశాలు మరుగునపడిపోతున్నాయనే చర్చ మొదలైంది.

'మూడు నెలల్లో ప్రభుత్వం కూలిపోతుంది. ఎంపి ఎన్నికల తర్వాత రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉండదు' అంటూ బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ హోదాలో కల్వకుంట్ల తారకరామారావు పొలిటికల్ కామెంట్ గేమ్‌కు తెరలేపారు. మరోవైపు కాంగ్రెస్, బిజెపి ఎంపి అభ్యర్థులు గెలిచేదాన్ని బట్టి ఆగస్టు తర్వాత రాష్ట్ర రాజకీయాల్లో కీలక మార్పులుంటానే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. బోటాబోటి మెజార్టీ (కేవలం ఐదుగురు ఎమ్మెల్యేలే ఎక్కువ) ఉన్న నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వంలోనూ కలవరం మొదలైంది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో పైచేయి సాధించేందుకు చాపకింది నీరులా సైలెంట్‌గా మైండ్‌గేమ్ మొదలుపెట్టింది. లేదు.. లేదు.. చేర్చుకోం అంటూనే బిఆర్ఎస్ ఎమ్మెల్యేలపై ఫోకస్ పెట్టింది. పార్లమెంట్ ఎన్నికల్లో ఏమాత్రం తేడా వచ్చినా బిజెపితో మొదటికే మోసం అన్న భయంతో గేట్లు ఎత్తేసింది. బిఆర్ఎస్ కీలక నేతలకు గాలం వేసి మరీ హస్తం ఖాతాలో వేసుకుంటోంది. బిఆర్ఎస్‌ను రాష్ట్రంలో లేకుండా చేస్తామంటూ కొందరు నేతలు బాహాటంగానే చెబుతున్నారు. కాంగ్రెస్ నేతలు చెబుతున్నట్టుగానే సీనియర్లు, జూనియర్లు అనే తేడా లేకుండా గులాబీ నేతలు ఫంక్చర్ అయిన కారు (అధికారం కోల్పోయిన బిఆర్ఎస్‌ను) దిగి చేయి పట్టుకునేందుకు తహతహలాడుతున్నారు. ఇప్పటికే దానం, కెకె, కడియం కాంగ్రెస్ గూటికి చేరిపోయారు. 30 మంది బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు తమతో టచ్‌లో ఉన్నారని కాంగ్రెస్ నేతలు బాహాటంగానే చెబుతున్నారు. ఈ సమయంలోనే మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఒకడుగు ముందుకేసి తమతో ఎనిమిది మంది బిజెపి ఎమ్మెల్యేలూ టచ్‌లో ఉన్నారంటూ చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశమయ్యాయి. దీనికి కౌంటర్‌గా బిజెపి మైండ్‌గేమ్ మొదలుపెట్టింది. కాంగ్రెస్ మంత్రులు తమతో ఐదుగురు టచ్‌లో ఉన్నారనీ, తమ ఎమ్మెల్యేల్లో ఏ ఒక్కరిని టచ్‌చేసినా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చేస్తామంటూ బిజెపి శాసనసభాపక్ష నేత మహేశ్వర్‌రెడ్డి బాంబు పేల్చారు . ఇంతకీ ఆ ఐదుగురు మంత్రులెవ్వరూ? కోమటిరెడ్డి లాంటోళ్లు ఐదుగురున్నా రని చెబుతూ మహేశ్వర్‌రెడ్డి తన మాటల్లోనే వెంకట్‌రెడ్డి ఒకరని చెప్పకనే చెప్పారు. ఇంకా ఆ నలుగురెవరు? అందులో ఉన్నదెవరు? నిజంగా పొంగులేటి బిజెపితో టచ్‌లోకి వెళ్లారా? ఇలా లీడర్ల ఒక్కోమాట ఎన్నో ప్రశ్నలను రేకెత్తిస్తోంది. రాష్ట్ర రాజకీయాలను వేడెక్కిస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని సెల్ఫ్ డిఫెన్స్‌లో పడేసింది. బిజెపి స్ట్రాటజీలో భాగంగానే ఏలేటి వ్యాఖ్యలు చేశారనే చర్చా రాజకీయ వర్గాల్లో నడుస్తోంది.

బిజెపి-బిఆర్ఎస్ ఒక్కటేనని అవసరమున్నప్పుడల్లా ఒకదాని కొకటి సహకరించుకుంటాయనీ, అందుకే ఎంపి ఎన్నికల్లో బిజెపికి లబ్ధి చేకూర్చేందుకు బిఆర్ఎస్ బలహీన అభ్యర్థులను బరిలోకి దింపిందనే విమర్శలను కాంగ్రెస్ పార్టీ ఎక్కుపెడుతున్నది. తామేం తక్కువ కాదంటూ ఓడిపోయే స్థానాల్లో బిసిలకు, గెలిచే స్థానాల్లో రెడ్లకు కాంగ్రెస్ పార్టీ టికెట్లను ఇస్తోందనే ఆరోపణలను ఎక్కుపెట్టి రాజకీయ లబ్ది పొందాలని బిఆర్ఎస్ పార్టీ చూస్తోంది. బిఆర్ఎస్-కాంగ్రెస్ పలు సందర్భాల్లో రాజకీయంగా పొత్తులు పెట్టుకుని ముందుకు సాగాయని, ఆ రెండు పార్టీలూ ఒక్కటేనని బిజెపి ఆరోపిస్తుంది. అంతిమంగా మూడు పార్టీలూ ప్రజా సమస్యలు, విభజన హామీలు, రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులు, ఇలా కీలకాంశాల ను మరిచి రాజకీయ వాదులాటల్లో మునిగిపోయారనే విమర్శలొస్తున్నాయి. సోషల్ ఇంజినీరింగ్‌లో పైచేయి సాధించేందుకు కాంగ్రెస్, బిజెపి పోటాపోటీగా ముందుకెళు న్నాయి. ఈ విషయంలో బిఆర్ఎస్ కాస్త వెనుకపట్టు పట్టినట్టు కనిపిస్తోంది.

ఫోన్‌ట్యాపింగ్ అప్రజాస్వామికం

- విచారణలో అన్ని విషయాలు తేల్చాలి
- గుడిసెవాసులపై కేసులు రద్దు చేయాలి
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్ వీరయ్య



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ వీరయ్య చిత్రంలో బివి రాఘవులు తదితరులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఫోన్‌ట్యాపింగ్ వ్యవహారం అప్రజాస్వామికమని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్ వీరయ్య విమర్శించారు. వ్యక్తిగత గోప్యతకు ఇది భంగం కలిగిస్తుందన్నారు. ట్యాపింగ్‌కు అవసరమైన పరికరాలు కొనుగోలు చేయాలంటే కేంద్రం అనుమతి కావాలని చెప్పారు. ట్యాపింగ్ చేయాలంటే రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇవ్వాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ అనుమతి లేకుండా పోలీసులే చేశారా? లేదా గత ప్రభుత్వమే ట్యాపింగ్ చేయించిందా? అన్నది విచారణలో తేలాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఎంబి భవన్‌లో ఆదివారం సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులుతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. ట్యాపింగ్‌పై కేంద్రం స్పందించడం లేదన్నారు. ట్యాపింగ్ వ్యవహారం పూర్తిగా చట్టవిరుద్ధంగా, రాజ్యాంగ విరుద్ధంగా చేశారని చెప్పారు. మేడిగడ్డ కుంగిపోవడం వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. మరమ్మతులు చేపట్టాలంటూ బిఆర్ఎస్ నేతలుంటుంటే, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలకూ పగుళ్లు ఉన్నాయని కాంగ్రెస్ నాయకులంటున్నారని వివరించారు. ఎన్‌డిఎస్‌ఎ అధికారులు, నిపుణుల సలహాలు తీసుకోవాలని సూచించారు. మేడిగడ్డలో అవినీతి, డిజైన్లో లోపాలు, ఎల్అండ్‌టి సంస్థ వైఫల్యంపై విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతులను ఆదుకోవాల్సిన బాధ్యత ఈ ప్రభుత్వంపై ఉందన్నారు. గత ప్రభుత్వం ముడుపుల కోసం ప్రయివేటు సంస్థలతో కుమ్మక్కై రూ.లక్ష కోట్లు ఖర్చు చేసిందని చెప్పారు. స్వార్థ ప్రయోజనాల కోసం ప్రభుత్వ ఖజానాను దుర్వినియోగం చేసిందన్నారు. దాన్ని తేల్చాలని కోరారు. వేసవితోపాటు కరువు ప్రారంభమైందని చెప్పారు. కరువు పీడిత ప్రాంతాల్లో ఒక్క మంత్రి పర్యటించలేదని, రైతులకు భరోసా కల్పించలేదని అన్నారు. ప్రాజెక్టులు, చెరువుల్లో నీళ్లు లేవని, భూగర్భ జలాలు పడిపోయాయని వివరించారు. రైతులు నష్టపోకుండా వారిని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జోక్యం చేసుకుని రైతాంగాన్ని ఆదుకోవడానికి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఎకరాకు రూ.20 వేలు నష్టపరిహారం చెల్లించాలని చెప్పారు. మద్దతు ధరకు అదనంగా రూ.500 బోనస్ ఇస్తామంటూ ఎన్నికల మ్యానిఫెస్టోలో కాంగ్రెస్ ప్రకటించిందన్నారు. ఆ మాట నిలబెట్టుకోవాలని కోరారు. 19 జిల్లాల్లో లక్షల కుటుంబాలు గుడిసెలు వేసుకున్నాయని, ఇందిరమ్మ ఇండ్ల కింద వారికి రూ.ఐదు లక్షల సాయం చేయాలని డిమాండ్ చేశారు. గుడిసెవాసులపై కేసులను రద్దు చేస్తామంటూ సిఎం హామీ ఇచ్చారని, వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించారు. ధరణి భూ సమస్యలు అలాగే ఉన్నాయని, బాధితులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ధరణిలోని లోపాలను సరి చేయాలన్నారు. గొర్రెలు, మేకల కుంభకోణం జరిగిందని, విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సిరిసిల్ల పవర్‌లూమ్ కార్మికుల సమస్యను పరిష్కరించాలని కోరారు. శాస్త్రీయ పద్ధతిలో కార్మికుల కనీస వేతనాలను పెంచాలని డిమాండ్ చేశారు. పార్లమెంటు ఎన్నికలకు ఇంకా సమయమున్నదని చెప్పారు. సిపిఐ పార్లమెంటు ఎన్నికల్లో వైఖరిని ప్రకటించలేదని అన్నారు. అవసరమైతే సిపిఐ, సిపిఎం సంప్రదించుకుంటాయని వివరించారు. ఈ పరిణామాలను చూసి ఎవరికి మద్దతివ్వాలో త్వరలో తుది నిర్ణయం తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, టి జ్యోతి తదితరులు పాల్గొన్నారు.


రోడ్డుపై ధాన్యం కుప్పలు

ఎక్కడికుప్పలు అక్కడే

- ధాన్యం కొనుగోలుకు ఎదురుచూపులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ధాన్యం చేతికిరావడంతో కొనుగోలు కేంద్రాల కోసం రైతులకు ఎదురుచూపులు తప్పడం లేదు. ధాన్యం కోతలు పూర్తి చేసుకుని రాశులుగా పోగుచేసి కొనుగోలు కేంద్రాల వద్ద పడిగాపులు కాస్తున్నారు. కేంద్రాలు ప్రారంభించకపోవడంతో ఎక్కడ అకాల వర్షాలు కురిస్తే... తీవ్రంగా నష్టపోతామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతులు పండించిన ధాన్యాన్ని మద్దతు ధర చెల్లించి కొంటామని ప్రభుత్వం పదేపదే ప్రకటించింది. కానీ నేటికీ ఎక్కడ కూడా కొనుగోలు కేంద్రాలను ప్రారంభించలేదు. దాంతో రైతులు చేతికొచ్చిన పంట పండించి కోసి ఆరబెడుతున్నారు. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడంతో దిక్కులేని పరిస్థితుల్లో రైతులు దళారులకు విక్రయించి నష్టపోతున్నారు. అధికారులు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తామని చెబుతున్నారే కానీ ఇప్పటికీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడంతో తాము దళారులను ఆశ్రయించి నష్టపోతున్నామని రైతులు తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కావున జిల్లా కలెక్టర్ తక్షణమే స్పందించి సొసైటీల ద్వారా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆనంద్, నర్సింహ

వినిమయ, విషప్రచారాన్ని అడ్డుకోవాలి

- పిఎన్ఎం రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు ఆనంద్, కట్టా నర్సింహ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సమాజంలో వస్తున్న వినిమయ, విషప్రచారాన్ని అడ్డుకోవాలని, అందుకోసం నేటి సమాజానికి అవసరమయ్యే కళలు, సంస్కృతిని అందించాలని ప్రజానాట్య మండలి రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు ఆనంద్, కట్టా నర్సింహ తెలిపారు. ఆదివారం భువనగిరి జిల్లాకేంద్రంలో ప్రజానాట్యమండలి రాష్ట్ర కమిటీ సమావేశం, రెండ్రోజుల శిక్షణాతరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నేటి సమాజంలో చరిత్రను వక్రీకరించే విధంగా సినిమాలు వస్తున్నాయన్నారు. తెలంగాణ సాయుధ రైతాంగ విప్లవ పోరాటం లేకుండా తెలంగాణ ప్రజలు విముక్తి కాలేరన్నారు. దేశంలో, రాష్ట్రంలో కుల, మత, ప్రాంతీయ, మూఢవిశ్వాసాలను పెంచుతూ ప్రజల్లో విద్వేషాలను బిజెపి సృష్టిస్తున్నదని తెలిపారు. తద్వారా రాజకీయ లబ్ది పొందడానికి కృషి చేస్తున్నారని, అలాంటి వారిని తిప్పి కొట్టాలన్నారు. భారతీయులందరూ ఒకటేనని చాటి చెప్పే కళారూపాలు, పాటలు, నృత్యాలను తయారు చేయాలన్నారు. వాటిని సోషల్ మీడియాలో అధునాతన పద్ధతిలో ప్రజలకు అందే విధంగా పెట్టాలని తెలిపారు. నేటి యువత మత్తు పదార్థాల వైపు పయనించే విధంగా కుట్రలు జరుగుతున్నాయన్నారు. వాటిని తిప్పి కొట్టడానికి మత్తు పదార్థాల వల్ల ఆరోగ్యం, ఆర్థిక, విలువలు ఎలా పోతాయో వివరించాలన్నారు. కవులు, కళాకారులు నూతనంగా రచించిన పాటలు పాడారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు అవ్వారి గోవర్ధన్, రాష్ట్ర కమిటీ సభ్యులు, జిల్లా కార్యదర్శి ముత్యాలు, రవి, శివ తదితరులు పాల్గొన్నారు.



తొలి దళిత సాహిత్య, సాంస్కృతిక ఉద్యమకారుడు దున్న ఇద్దాసు

ప్రజాశక్తి - కల్చరల్

సాహిత్యం, సంస్కృతిని, సామాజిక సమైక్యత కోసం కృషి చేసిన మహనీయలలో అగ్రగణ్యుడు దున్న ఇద్దాసు అని తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ పూర్వ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా అన్నారు. శతాబ్ది పూర్వ మహనీయుల యాదిలో కార్యక్రమంలో భాగంగా తొలి దళిత కవి, తెలంగాణ వేమన దున్న ఇదాసు సంస్మరణ సభ ఆదివారం చిక్కడపల్లి త్యాగరాయ గాన సభలోని కళా సుబ్బారావు కళా వేదిక పై గాన సభ నిర్వహణలో జరిగింది.అధ్యక్షుడు కళా విఎస్ జనార్ధన మూర్తి అధ్యక్షతన వహించిన సమావేశంకు. ముఖ్య అతిథిగా హాజరైన ఉప్పల శ్రీనివాస్ గుప్తా మాట్లాడుతూ ఆచార్య బిరుదురాజు రామరాజు వంటి పరిశోధకులు ఇద్దాసును 'మాదిగ మహాయోగి'గా కీర్తించారని. సుంకిరెడ్డి నారాయణరెడ్డి వంటి చరిత్రకారులు, సాహిత్య చరిత్ర రచయితలు ఇద్దాసును 'తొలి దళిత కవి'గా గుర్తించారని అన్నారు. అచల యోగిగా, సంకీర్తనాకారుడిగా, తత్త్వకవిగా, ప్రసిద్ధుడైన దున్న ఇద్దాసు అట్టడుగు కులాల్లో చైతన్యానికి బాటలు వేసిన మహనీయుడు అని కీర్తించారు. కార్యక్రమంలో స్వర కిన్నెర చింతలపూడి త్రినాథరావు, బిజెపి సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఏ.వినయ్ కుమార్, గాయకుడు. సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ సీట్ల పంచాయితీకి నేడు శుభం కార్డు!

- సోనియా నేతృత్వంలో సిఇసి భేటీ
- మిగిలిన నాలుగు స్థానాలపై నిర్ణయం
- ఢిల్లీకి సిఎం రేవంత్, డిప్యూటీ సిఎం భట్టి



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాంగ్రెస్ సీట్ల పంచాయితీకి నేడు శుభం కార్డు పడనుందని ఆ పార్టీ వర్గాలంటున్నాయి. సోమవారం ఢిల్లీలో జరగనున్న సెంట్రల్ ఎలక్షన్ కమిటీ(సీఈసీ) సమావేశంలో పాల్గొనేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క, సిఇసి సభ్యులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి బయలుదేరి వెళ్లనున్నారు. పార్టీ అధినేత్రి సోనియా, రాహుల్, కేసీ.వేణుగోపాల్, అంబికా సోనీ, కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ తదితరులు పాల్గొనే ఈ సమావేశంలో మిగిలిన నాలుగు సీట్లకు అభ్యర్థులను ప్రకటించే అవకాశముందని తెలుస్తోంది.

రాష్ట్రంలోని 17 స్థానాలకు గాను కాంగ్రెస్ ఇప్పటికే మూడు విడుతలుగా 13 స్థానాల్లో అభ్యర్థులను ప్రకటించింది. మిగిలిన ఖమ్మం, కరీంనగర్, హైదరాబాద్, వరంగల్ స్థానాలకు నేడు అభ్యర్థులు ఖరారు కానున్నారు. ఖమ్మం నుంచి పొంగులేటి ప్రసాద్‌రెడ్డి, మల్లు నందిని, తుమ్మల యుగంధర్‌తో పాటు కాంగ్రెస్ సీనియర్ నేత వంకాయలపాటి రాజేంద్రప్రసాద్ పేరు కొత్తగా తెరపైకి వచ్చింది. ఆ జిల్లాకు చెందిన మంత్రుల కుటుంబాల నుంచి ముగ్గురు టికెట్ ఆశిస్తుండటంతో వారందరినీ పక్కన పెట్టి రాజేంద్రప్రసాద్‌కు అవకాశం ఇవ్వడం ద్వారా ఈ వివాదానికి ఫుల్‌స్టాప్ పెట్టాలని అధిష్టానం ఓ నిర్ణయానికి వచ్చినట్టు తెలుస్తోంది. వరంగల్ సీటు కోసం బిఆర్ఎస్ సిట్టింగ్ ఎంపి పసునూరి దయాకర్‌తో పాటు డి సాంబయ్య, అద్దంకి దయాకర్ పోటీ పడుతున్నారు. ఇది ఇలా ఉండగా బిఆర్ఎస్ ఎమ్మెల్యే కడియం శ్రీహరితో పాటు అతని కూతురు, ఆ పార్టీ ఎంపీ అభ్యర్థి కడియం కావ్య కంగ్రెస్ తీర్థం పుచ్చుకోవడంతో మొదటి నుంచి టికెట్‌పై ఆశలు పెట్టుకున్న వారికి ఆశా భంగం తప్పదని రాజకీయ వర్గాలంటున్నాయి. పార్టీ మారిన సిట్టింగ్ ఎంపి పసునూరి సీటు గ్యారెంటీతోనే బిఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్ కండువా కప్పుకున్నట్టు ప్రచారం జరుగుతోంది. అయితే చివరి వరకు ఎవరికి సీటు దక్కుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. కరీంనగర్ టికెట్ కోసం హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి, సంతోష్ కుమార్ మొదటి నుంచి పోటీ పడుతున్నారు. అల్గిరెడ్డి పేరు ఖరారైందని వార్తలు వచ్చినప్పటికి చివరి క్షణంలో తీన్మార్ మల్లన్న పేరు తెరపైకి వచ్చింది. హైదరాబాద్ పార్లమెంట్ స్థానానికి మస్కతితో పాటు ఫిరోజ్ ఖాన్ పోటీ పడుతున్నారు.

అనూహ్యంగా ఈ స్థానం నుంచి ఓ టెన్నిస్‌స్టార్‌తో పాటు సుప్రీంకోర్టు అడ్వకేట్, షానవాజ్ తుబుసుం పేర్లు వినిపిస్తున్నాయి. రాష్ట్ర, జిల్లా నేతలు, పార్లమెంట్ పరిధిలోని ఎమ్మెల్యేల అభిప్రాయాలను స్వీకరించిన ఎఐసిసి, వారిచ్చిన సలహాలు, సూచనల మేరకు తుది జాబితాను సిఇసికి పంపింది. ప్రజా బలం, కుల సమీకరణలు, పార్టీకి చేసిన సేవలు, విధేయత తదితర అంశాలను ప్రాతిపదికగా తీసుకుని చర్చించి సీట్లపై అధిష్టానం ఇప్పటికే ఓ నిర్ణయానికి వచ్చినట్టు సమాచారం. ఈ నేపథ్యంలో ఢిల్లీలో సోమవారం సాయంత్రం జరగనున్న సిఇసి భేటీలో మిగిలిన నాలుగు సీట్లకు అభ్యర్థులు ఖరారయ్యే అవకాశాలున్నాయని పార్టీ వర్గాలంటున్నాయి.

పోడు భూముల కోసం గిరిజనుల మధ్య ఘర్షణ

- అడ్డుకోబోయిన పోలీసులపై ఇరు గ్రూపుల దాడి
- 40 మందిని అదుపులోకి తీసుకున్న పోలీసులు



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పోడు భూముల విషయమై రెండు గిరిజన గ్రూపుల మధ్య జరుగుతున్న ఘర్షణను అడ్డుకోబోయిన పోలీసులను ఆ రెండు గ్రూపులు కలిసి మూకుమ్మడిగా దాడిచేసి గాయపర్చిన ఘటన ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం చంద్రాయపాలెంలో ఆదివారం మధ్యాహ్నం జరిగింది. అందిన సమాచారం మేరకు.. చంద్రాయపాలెంలో వన సంరక్షణ సమితి (విఎస్ఎస్), అటవీశాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఉన్న భూమి విషయమై చంద్రాయపాలెం, బుగ్గపాడు గిరిజనుల మధ్య కొంతకాలంగా వివాదం నడుస్తోంది. ఈ నేపథ్యంలో సదరు భూమిలో మొక్కలు నాటేందుకు ఇటీవల అటవీశాఖ మొద్దులు తీసి శుభ్రం చేశారు. ఈ క్రమంలో బుగ్గపాడు, నాగుపల్లి గ్రామాలకు చెందిన కొందరు గిరిజనులు ఆ భూమిని ఆక్రమించుకునేందుకు ప్రయత్నాలు మొదలు పెట్టినట్టు తెలిసింది. వారి ప్రయత్నాలను చంద్రాయపాలెం గిరిజనులు, అటవీ సిబ్బంది అడ్డుకున్నారు. రెండ్రోజుల క్రితం ఆ రెండు గ్రూపుల మధ్య ఘర్షణ కూడా జరిగింది. ఘర్షణ జరిగిన నేపథ్యంలో అటవీ అధికారులు బుగ్గపాడు గిరిజనులపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు అందుకున్న సిఐ టి కిరణ్ బుగ్గపాడు గిరిజనులను పిలిపించి మాట్లాడారు. భూమి ఎవరికి చెందుతుందో రెవెన్యూ అధికారులతో విచారణ చేయించి సమస్యను పరిష్కరిస్తామని, గొడవలు పడొద్దని, భూమి పైకి వెళ్లొద్దని నచ్చజెప్పి వాళ్లని పంపించేశారు.

మళ్లీ రెండు గ్రూపుల మధ్య ఘర్షణ


చంద్రాయపాలెంలో రెండు గ్రూపుల మధ్య ఆదివారం మళ్లీ ఘర్షణ చెలరేగింది. బుగ్గపాడు గిరిజనులతో పక్క గ్రామమైన నాగుపల్లికి చెందిన కొందరు తోడయ్యారు. వీళ్లంతా కలిసి చంద్రాయపాలెం వెళ్లి అక్కడి గిరిజనులపై ఘర్షణకు దిగారు. గిరిజనుల మధ్య ఘర్షణ జరుగుతున్న విషయం 100 ద్వారా పోలీసులకు సమాచారం అందింది. సమాచారం అందుకున్న సిఐ టి కిరణ్ సిబ్బందితో ఘర్షణ జరుగుతున్న ప్రాంతానికి వెళ్లారు. ఘర్షణను నివారించేందుకు ప్రయత్నించగా ఒక్కసారిగా ఘర్షణ పడుతున్న రెండు గ్రూపులు పోలీసులపై తిరగబడ్డారు. సిఐ అక్కడికి వెళ్లిన వెంటనే ఒకరిపై చేయి చేసుకోవడంతో ఇది చూసిన రెండు గ్రూపులకు చెందిన గిరిజనులంతా ఏకమై సిఐపై దాడికి దిగారని, ఈ ఘటనలో 40 మంది గిరిజనులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్టు తెలుస్తోంది. పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

7న మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష

- నేటినుంచి హాల్‌టికెట్ల డౌన్‌లోడ్‌కు అవకాశం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని మోడల్ స్కూళ్లలో 2024-25 విద్యాసంవత్సరంలో ఆరో తరగతిలో మొత్తం సీట్లతోపాటు ఏడు నుంచి పదో తరగతి ప్రవేశాలకు సంబంధించి ఖాళీ సీట్ల భర్తీ కోసం ఆన్‌లైన్‌లో ఈనెల ఏడో తేదీన రాతపరీక్ష జరగనుంది. అదేరోజు ఉదయం పది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఆరో తరగతి, మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు ఏడు నుంచి పదో తరగతికి దరఖాస్తు చేసిన అభ్యర్థులకు పరీక్ష నిర్వహిస్తారు. ఈ మేరకు మోడల్ స్కూళ్ల అదనపు సంచాలకులు ఎస్ శ్రీనివాసాచారి ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలోని 194 మోడల్ స్కూళ్లలో ఆంగ్ల మాధ్యమంలో బోధన ఉంటుందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 62,983 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారని వివరించారు. telanganams.cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా సోమవారం నుంచి హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకునేందుకు అవకాశముందని సూచించారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న బిఆర్ఎస్ నేతలు

తాగునీటి కోసం సాగర్ జలాలు రప్పించాలి

- బిఆర్ఎస్ ఖమ్మం అభ్యర్థి నామ, మాజీ మంత్రి పువ్వాడ, రాజ్యసభ ఎంపి వద్దిరాజు
- ఎండిన పంటలు, అడుగంటిన పాలేరు జలాశయం పరిశీలన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కెసిఆర్ అంటేనే కాలువలు, చెరువులు, నదులు.. ఆయన లేకపోతే నీటి ఎద్దడి వస్తుందని కేవలం నాలుగు నెలల్లో నిరూపితమైందని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, బిఆర్ఎస్ ఖమ్మం పార్లమెంట్ అభ్యర్థి నామ నాగేశ్వరరావు, రాజ్యసభ ఎంపి వద్దిరాజు అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేతగాని తనం వల్ల వచ్చిన కరువుగా దీన్ని గుర్తించాలని తెలిపారు. అడుగంటిన పాలేరు జలాలు, ఎండిన పంటల పరిశీలన అనంతరం ఖమ్మంలోని బిఆర్ఎస్ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బిఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి నామ నాగేశ్వరరావు, రాజ్యసభ ఎంపి వద్దిరాజు రవిచంద్రతో కలిసి అజయ్ మాట్లాడారు. మన చేతుల్లో ఉన్న వ్యవస్థలను పదేళ్లు భద్రంగా కాపాడుకున్నామన్నారు. నాగార్జునసాగర్ నీళ్లను తాగునీటిగా తీసుకోలేని పరిస్థితి ఈ ప్రభుత్వానిది అన్నారు. రాష్ట్రంలో పంటలు ఎండిపోవడమే కాదు, తాగునీటికి కూడా సమస్యలు వచ్చాయన్నారు. గడచిన పదేండ్లలో ఎప్పుడైనా ఈ పరిస్థితి వచ్చిందా అని ప్రశ్నించారు. మార్చిలోనే ఈ సమస్య ఉంటే ఏప్రిల్, మేలో ఎంత నీటి ఎద్దడి ఉంటుందో అర్థం చేసుకోవాలన్నారు. ఒక్క నీటి సమస్యే కాదు.. కరెంట్ సమస్య కూడా రాష్ట్రంలో ఉందన్నారు. రానున్న రోజుల్లో ఇది తీవ్రం అవుతుందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు అవుతున్నా ఇంతవరకు రైతుబంధు పడలేదన్నారు. రైతులకు ఎకరానికి నష్టం కింద రూ.30 వేలు ఇచ్చి ఆదుకోవాలని కోరారు. పాలేరులో సగం టిఎంసి మాత్రమే నీళ్లు ఉన్నాయన్నారు. కేవలం వారం రోజులకే ఈ నీళ్లు సరిపోతాయని తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో రేపటి నుంచి బిఆర్ఎస్ అభ్యర్థి నామ నాగేశ్వరరావు ప్రచారం నిర్వహిస్తారని, అత్యధిక మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

రైతులు దుఃఖిస్తున్నారు : ఎంపి అభ్యర్థి నామ

రైతు బిడ్డగా.. కష్టాలు దగ్గరగా చూసిన వ్యక్తిగా ఇవ్వాళ రాష్ట్రంలో ఉన్న సమస్యలను చూసి చాలా బాధపడ్డానని బిఆర్ఎస్ లోక్‌సభ అభ్యర్థి నామ నాగేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసినందుకు రైతులు బాధపడుతున్నారని తెలిపారు. ఒక్క తడికి నీళ్లు వదిలి ఉంటే పంట చేతికి వచ్చేదని ఓ రైతు ఆవేదన వ్యక్తం చేశారని చెప్పారు. మా చిన్నప్పుడు అన్నం తినాలంటే పండుగ రావాలని.. కానీ కెసిఆర్ హయాంలో బియ్యం ఎగుమతుల్లో దేశంలోనే నెంబర్ వన్ స్థానంలో ఉన్నామన్నారు. నీళ్లు లేక రాష్ట్ర ప్రజలు నిత్యం బోర్లు వేస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలో 15 లక్షల ఎకరాల పంటలు ఎండిపోయాయని చెప్పారు. ఇప్పటికైనా ప్రజలు కెసిఆర్‌కు అండగా ఉండాలనే నిర్ణయానికి వస్తున్నారని అన్నారు.

కేశవ్ అన్న ఏమి ఆశించి పార్టీ వీడారో తెలియదు: ఎంపి రవిచంద్ర

పార్టీలో సెకండ్ పొజిషన్‌లో ఉన్న కే. కేశవరావు ఏమి ఆశించి బిఆర్ఎస్‌ను వీడారో తెలియదు గానీ కేసీఆర్ ఆయనకు ఎనలేని ప్రాధాన్యం ఇచ్చారని రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర వ్యాఖ్యానించారు. నామ గెలుపుతో కేసీఆర్ సంతోషిస్తారని అన్నారు. పాలేరు రిజర్వాయర్ ఇంతలా అడుగంటిన దాఖలాలు లేవని చెప్పారు. పాలేరు జలాశయాన్ని సాగర్ జలాలతో నింపి తాగునీరు వెంటనే విడుదల చేయాలని, పంట నష్టపోయిన రైతులకు రూ. 10,000 పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కనీసం 13 ఎంపీ సీట్లు గెలవాలని పిలుపునిచ్చారు. విలేకరుల సమావేశంలో ఎమ్మెల్సీ, బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు తాతా మధుసూదన్, మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, వనమా వెంకటేశ్వర్లు, మెచ్చా నాగేశ్వరరావు, బానోత్ చంద్రావతి, మదన్ లాల్, జడ్పీ చైర్మెన్ లింగాల కమల్ రాజు, మేయర్ పునుకొల్లు నీరజ, డిసిసిబి మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, కొండబాల కోటేశ్వరరావు పాల్గొన్నారు.

పదవే పరమార్థం

- సిద్ధాంతాలు, విలువలకు తిలోదకాలు
- గెలుపు, అధికారం, డబ్బే ప్రధానం
- చొక్కాలు మార్చినంత ఈజీగా పార్టీల మార్పు
- తెలంగాణలో నయా పొలిటికల్ ట్రెండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

"స్మశాన వాటిక ముందు ముగ్గుండదు... రాజకీయ నాయకులకు సిగ్గుండదు" అని ఓ సినిమాలో కోట శ్రీనివాసరావు చెప్పిన డైలాగ్ ప్రస్తుత బూర్జువా రాజకీయాలకు బాగా సరిపోతుంది...పదేళ్లు అంటకాగి, రాత్రికి రాత్రి పార్టీ మారగానే.... సొంత ఇంటికొచ్చినంత ఆనందంగా ఉందని ఒకరంటే, పుట్టింటికొచ్చిన అనుభూతి కలుగుతుందని మరొకరూ నిస్సిగ్గుగా సమర్థించుకుంటున్నారు. సిద్ధాంతాలు, విలువలకు తిలోదకాలిచ్చి, అధికారం, పదవీ, డబ్బే ప్రధానంగా తెలంగాణలో రాజకీయ క్రీడ సాగుతోంది.

పదేళ్ల బిజెపి పాలనలో ప్రతి పక్షాలు కకావికలమయ్యాయి. అధికార కాషాయ పార్టీ ప్రతీకార రాజకీయాలకు కొన్ని చోట్ల వైరి పక్షాల ఉనికే ప్రశ్నార్థకమైంది.. ఇది దేశంలో పరిస్థితి. అయితే అలాంటి నిర్బంధ వాతావరణం రాష్ట్రంలో లేక పోయినప్పటికి అధికారం, పదవి, డబ్బే ప్రధానంగా మారడంతో... గతంలో బిఆర్ఎస్ ఎంత ఉచ్చ స్థితిని అనుభవించిందో ఇప్పుడు అంతటి హీన స్థితిని ఎదుర్కొంటోంది. ఎన్నికల్లో ఎవరెవరు ప్రత్యర్థులుగా తలపడ్డా చివరికి అధికారంవైపే అందరూ పయనమవుతున్నారు. గెలుపు, అధికారమే పరమావధి తప్ప ... ప్రజా సేవ చేయడానికే వచ్చామని ఎవరైనా అంటే ప్రజలు నవ్వుకునే పరిస్థితి నెలకొంది. సిట్టింగ్ ఎంపిల నుంచి మొదలుకుని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ముఖ్యులు తమను తాము రక్షించుకునేందుకు పార్టీలు మారుతున్నారు. పెద్దపల్లి ఎంపి సీటును కొప్పుల ఈశ్వర్‌కు ప్రకటిస్తారని తెలియగానే బిఆర్ఎస్ సిట్టింగ్ ఎంపి వెంకటేష్ నేత పార్టీ ఫిరాయించి కాంగ్రెస్ పంచన చేరారు. చేవెళ్ల సిట్టింగ్ ఎంపి రంజిత్‌రెడ్డికి టికెట్ ఇచ్చినా...గులాబీ బాస్ చెప్పినా.. రాత్రికి రాత్రే హస్తం గూటికి చేరి అదే పార్టీ నుంచి టికెట్ సంపాదించుకున్నారు. జహీరాబాద్, నాగర్ కర్నూల్ బీఆర్ఎస్ సిట్టింగ్ ఎంపీలు బిబి పాటిల్, రాములు బిజెపి తీర్థం పుచ్చుకుని ఆ పార్టీ నుంచి మళ్లీ బరిలో నిలిచారు. అయితే రాములు మాత్రం తన కొడుకును లైన్లో పెట్టారు. ఇక హైదరాబాద్ శివారులో గట్టి పట్టున్న పట్నం మహేందర్ రెడ్డి చివరి క్షణంలో కాంగ్రెస్ గూటికి చేరి తన భార్య సునితారెడ్డికి మల్కాజిగిరి టికెట్ దక్కించుకున్నారు. ఇక దానం నాగేందర్ ఖైరతాబాద్ ఎమ్మెల్యేగా గులాబీ పార్టీ నుంచి గెలిచినా కాంగ్రెస్ కండువా కప్పుకుని సికింద్రాబాద్ ఎంపీ అభ్యర్థిగా బరిలో నిలిచారు. హైదరాబాద్ మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, మాజీ ఎమ్మెల్యేలు సైదిరెడ్డి, ఆరూరి రమేష్, లాంటి నేతలు పార్టీలు మారారు. స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, అతని కూతురు వరంగల్ బీఆర్ఎస్ ఎంపీ టికెట్ దక్కించుకున్న కడియం కావ్య, రాజ్యసభ సభ్యులు కె.కేశవరావు, అతని కూతురు హైదరాబాద్ మేయర్ గద్వాల విజయలక్ష్మి, మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి లాంటి ముఖ్యులూ పార్టీ మారేందుకు సిద్ధమయ్యారు. వార్డు మెంబర్లు, ఎంపిటిసిలు, జడ్‌పిటిసిలు, ఎంపిపిలు, జిల్లా పరిషత్ చైర్మన్ల వరకొస్తే రాష్ట్ర వ్యాప్తంగా భారీగా పార్టీని వీడుతున్నారు. వ్యాపారాలు సజావుగా సాగడానికి, ఆస్తులు,అధికారం కోల్పోకుండా ఉండడానికి చొక్కా మార్చినంత ఈజీగా పార్టీలు మార్చుతున్నారు."నీవు నేర్పిన విద్యే నీరజాక్ష " అన్నట్టు 2014, 2018 విజయాల తర్వాత బిఆర్ఎస్ ఆడిన ఆటనే నేడు కాంగ్రెస్ ఆడుతోంది. అసెంబ్లీలో కనీసం ప్రతిపక్ష హోదా దక్కకుండా చేసిన ఆ పార్టీపై నేడు బదులు తీర్చుకుంటోంది. దశాబ్ద కాలానికి పూర్వం వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో మొదలైన ఈ క్రీడ కెసిఆర్ పదేళ్ల పాలనలో పరాకాష్టకు చేరింది. తాజాగా రేవంత్‌రెడ్డి హయానికొచ్చేసరికి మరింత పీక్ స్టేజికి చేరింది. ఈ ట్రెండ్ ఇలాగే కొనసాగితే సిద్ధాంతాలకూ విలువలకు ఆస్కారముంటుందా అన్న ప్రశ్న ప్రజలను ఆందోళనకు గురి చేస్తోంది..

బలమైన చట్టం రావాలి

1985లో పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టాన్ని తీసుకొచ్చారు. ఇందుకనుగుణంగా రాజ్యాంగ సవరణ చేసి పదో షెడ్యూల్లో చేర్చారు. ఈ చట్టం ప్రకారం పార్టీ ఫిరాయించిన చట్ట సభల సభ్యుని సభ్యత్వాన్ని రద్దు చేయడంతో పాటు తర్వాతి ఎన్నికల్లో పోటీ చేయకుండా అనర్హుడిని చేసే అవకాశం ఉంది. అయితే అందులో ఉన్న లొసుగులు, మినహాయింపుల వల్ల అది పటిష్టంగా అమలు జరగడం లేదు. చట్టంలోని లోపాలను ఆసరాగా చేసుకుని చట్ట సభల సభ్యులు యధేచ్ఛగా పార్టీలను ఫిరాయిస్తున్నారు. ఏండ్లకు ఏండ్లు సాగే విచారణలు, సాగదీతలు పార్టీ ఫిరాయింపులకు మరింత ప్రోత్సాహాన్నే అందిస్తున్నాయనే విమర్శ ఉంది. దీనికి మరిన్ని సవరణలు చేసి ఫిరాయించిన వ్యక్తులు ఎంతటి వారైనా వేటు తప్పదనే బలమైన చట్టాన్ని తెచ్చినప్పుడే వీటికి అడ్డుకట్ట పడుతుందని భావిస్తున్నారు.